## క్లుప్తంగా

### తహసీల్దార్‌గా సత్యనారాయణ



**శాయంపేట** : తహసీల్దార్‌గా కల్వల సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ సుభాషిణి హనుమకొండ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. కాగా పరకాల ఎఫ్‌సీఐలో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సత్యనారాయణకు పదోన్నతి కల్పిస్తూ శాయంపేట తహసీల్దార్‌గా నియమించినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పూలమొక్క అందించి స్వాగతం పలికారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**నర్సంపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో హిస్టరీ, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్, బోటనీ, జువాలజీ, క్రాప్ ప్రొడక్షన్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు కోసం గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి ఈనెల 9న మధ్యాహ్నం 3 గంటల లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో కనీసం 55 శాతం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ కలిగిన వారు అర్హులని తెలిపారు. నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

### గిరిజన యువకుడికి డాక్టరేట్

**చెన్నారావుపేట:** మండలంలోని ఎల్లాయగూడెం శివారు కొర్ర తండాకు చెందిన గిరిజన యువకుడు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్) దన్బాద్ నుంచి 'డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ఆప్టిమైజేషన్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్' అంశంపై బుధవారం డాక్టరేట్ అందుకున్నాడు. తండాకు చెందిన కొర్ర చత్రు –పూలమ్మ కుమారుడు బాలు ఎంహెచ్ఆర్‌డీ నుంచి నేషనల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. ప్రొఫెసర్ వివేకానంద ముఖర్జీ గైడెన్స్‌లో'అమెండెడ్ వెర్సిఒన్స్ ఆఫ్ స్టూడెంట్ సైకాలజీ బెస్ట్ ఆప్టిమైజేషన్ అల్గోరిథం ఫర్ డిస్ట్రిబ్యూటెడ్ జనరేషన్ ఆలోకేషన్ ఇన్ రెడియాల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్' అనే అంశంపై పరిశోధనకు స్కూల్ ఆఫ్ మైన్స్ నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ నందు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ డిగ్రీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. రీసెర్చ్ స్టూడెంట్‌గా ఇంటర్నేషనల్ ప్రెస్టీజియస్ జర్నల్స్‌లో తన రీసెర్చ్ టాపిక్‌పై సిక్స్ రిసెర్చ్ ఆర్టికల్స్‌ని పబ్లిష్ చేశాడు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వర్ధన్నపేట** : బైక్‌పై వెళ్తున్న వ్యక్తులు రహదారిపై అడ్డుగా వచ్చిన దూడను ఢీ కొట్టడంతో ఇరువురు కిందపడి తీవ్రగాయాలైన సంఘటన శుక్రవారం కడారిగూడెంలో చోటుచేసుకుంది. రాయపర్తి మండలం విద్యానగర్ తండా కేశవపురం గ్రామానికి చెందిన నేతావత్ రాంబాబు, భూక్యా మాన్‌సింగ్‌లు బోరు మోటారు మరమ్మతులు చేయడానికి వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెం గ్రామానికి బైక్‌పై బయలుదేరారు. ఇల్లంద శివారు జాతీయ రహదారిపై ఒక్కసారిగా దూడ అడ్డురావడంతో దానిని ఢీ కొట్టి అదుపు తప్పికింద పడడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 సమాచారం అందించగా క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

### పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

**పర్వతగిరి:** మండలంలోని ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ శంకర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలో ఫ్రైడే డ్రైడే సందర్భంగా శుక్రవారం గ్రామంలోని పలు వీధులలో ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలు, హెల్త్ సిబ్బందితో కలిసి సీజనల్ వ్యాధుల పట్ల సూచనలు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి రఘు పాల్గొన్నారు.

### ఘనంగా 'కుడా' చైర్మన్ జన్మదిన వేడుకలు

**సంగెం:** కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు మునుకుంట్ల కోటేశ్వర్, రమేష్, సంపత్‌రెడ్డి, రవికుమార్, నాగరాజు, రాజు, సాంబయ్య, శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

### అధికారులపై చర్యలు తీసుకోవాలి

**ఖానాపురం:** గ్రామంలోని సమస్యలు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని రంగాపురం గ్రామస్తులు శ్రీనివాసరావు, మహేష్, సదయ్యలు కోరారు. ఈ మేరకు కలెక్టర్ సత్యశారదాదేవి, ఆర్డీఓ కార్యాలయాల్లో శుక్రవారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సమస్యలు తెలిపారు.

# మట్టి విగ్రహాలతోనే పర్యావరణ పరిరక్షణ

- విద్యార్థులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు
- ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను నిషేధించాలని సూచన
- నేడు కొలువుదీరనున్న గణనాథుడు

**ఐనవోలు** : మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, విద్యా వారధి అధ్యక్షుడు సారయ్య కోరారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్థులతో మట్టి గణపతులను తయారు చేయించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొమ్మిది రోజుల పాటు జరిగే గణపతి ఉత్సవాలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని సూచించారు. పండుగ పేరుతో పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించొద్దని సూచించారు. కృత్రిమ రంగులు కలిపి చేసిన విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేసినపుడు నీరు కలుషితం అవుతుందన్నారు. హంగులు, ఆర్భాటాలు కాకుండా ప్రకృతిలో దొరికిన సహజ వస్తువులను వినియోగించి విఘ్నేశ్వరున్ని పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, విజయ, సీఆర్పీ రేవతి పాల్గొన్నారు.

**ధర్మసాగర్‌లో..**

**ధర్మసాగర్** : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి వినాయకులను పూజించడం వలన పర్యావరణానికి ఎంతో ఉపయోగం ఉందని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పెద్దపెండ్యాల ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని, విద్యార్థులు మట్టితో గణపతులను తయారు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారు చేసిన వినాయకులను వాడడం వలన కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, నరహరి, పద్మ, సునిత, అంజయ్య, నరేందర్, రాజన్న, రమేశ్, శ్రీనాథ్, చంద్రమౌళి, పాల్గొన్నారు.



కమలాపూర్ : విద్యార్థులతో కలిసి మట్టి ప్రతిమలను ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు



వేలేరు : మట్టి విగ్రహాలను అందజేస్తున్న రాజు



ధర్మసాగర్‌లో..

**వేలేరులో..**

**వేలేరు** : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఎర్త్ ఫౌండేషన్ డైరక్టర్ మంగళంపల్లి రాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు శుక్రవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యతన్నారు. విద్యార్థులకు విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్న తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఎర్త్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవి, వాలంటీర్లు పాల్గొన్నారు.

**కమలాపూర్‌లో..**

**కమలాపూర్** : వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతులనే పూజిద్దామని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల అన్నారు. మండలంలోని ఉప్పల్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాల ఎన్‌జీసీ ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశారు. హెచ్ఎం మాట్లాడుతూ.. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా నీటితో పాటు పర్యావరణం కలుషితమవుతుందని అన్నారు. ఉపాధ్యాయులు మాధవి, రాజేందర్, శిరీష, రఘుపతి, సదాశివరెడ్డి, ఉమారాణి, ప్రకాశ్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఐనవోలు : తాము తయారు చేసిన మట్టి ప్రతిమలను చూపుతున్న చిన్నారులు

# ఉత్తమ గురువులకు ఘన సన్మానం



ఆత్మకూరు : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు



పరకాల : శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

**ఆత్మకూరు** : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు, ప్రశంస పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులను పీఆర్టీయూ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. హౌజుబుజుర్గులో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు అనురాధ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోగా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా రమేశ్, రవి, భిక్షపతి, పుష్పలీల, ఉషారాణి, వేమారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, రాజు, సోమయ్య, గ్రేసమ్మ, రిజ్వానను శుక్రవారం ఘనంగా సన్మానించారు. రానున్న రోజుల్లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు బుజంగరావు, ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పరకాలలో..**

**పరకాల** : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల జువాలజీ విభాగం అధ్యాపకుడు డాక్టర్ అన్నెం శ్రీనివాస్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంతోశ్‌కుమార్‌తో పాటు అధ్యాపకులు, కళాశాల ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రిన్సిపాల్ కొనియాడారు.

## అటెన్షన్ ప్లీజ్

# ప్రమాదకరంగా మలుపులు



మండలంలోని పెద్దకోడెపాక గ్రామం నుంచి మైలారం వెళ్లే దారిలో మలుపుల వద్ద చెట్లు ఏపుగా పెరిగాయి. వాహనాలు ఎదురెదురుగా వస్తే కనిపించడం లేదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, పెరిగిన చెట్టుకొమ్మలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు.

– శాయంపేట

ప్రశ్నించాల్సిన అధికారి పేరు : పబ్బు సునీత్, పంచాయతీ కార్యదర్శి
ఫోన్‌నంబర్ 96662 01499

## సంక్షిప్తంగా

### హుండీ లెక్కింపు




**వేలేరు** : మండలంలోని మల్లికుదుర్ల శివారులో గల గట్టుమల్లికార్జున స్వామి హుండీలను ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం లెక్కించారు. వివిధ టిక్కెట్ల ద్వారా హుండీల్లో రెండు నెలలుగా కానుకల రూపంలో సమర్పించగా రూ.1లక్ష 19వేల798 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. అలాగే త్వరలోనే దేవాలయ పరిసరాల్లో కాటేజీల నిర్మాణం చేపడతామని, ఆలయ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించనున్నట్లు తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ డివిజన్ పరిశీలకుడు సంజీవరెడ్డి, పూజారులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు షూ బహూకరణ



**శాయంపేట** : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు బాసని సుదర్శనం జ్ఞాపకార్థం అతని భార్య, పిల్లలు బాసాని అరుణ, సృజన, చైతన్య శుక్రవారం షూ అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పద్మ, సదానందం, హజీముద్దీన్, ఉదయ్‌శ్రీ, సత్యప్రసాద్, రాజేశ్‌శర్మ, గ్రామస్తులు భిక్షపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

### కోళ్లఫారం ఏర్పాటు చేయొద్దు



**ఆత్మకూరు** : గ్రామస్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని లింగమడుగుపల్లి గ్రామంలో కోళ్ల ఫారం ఏర్పాటును నిలిపివేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కోళ్ల ఫారం ఏర్పాటుతో దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**పరకాల** : ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన గువ్వ రాములు కుటుంబాన్ని, అనారోగ్యంతో మృతిచెందిన బొచ్చు కొమురయ్య కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి శుక్రవారం పరామర్శించారు. చెరువులో పడి మృతిచెందిన గువ్వ రాములు కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ విజయపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మొగిలి, రాము, బీఆర్ఎస్ నాయకులు సత్యనారాయణ, నవీన్, నాగరాజు, చిరంజీవి, హమీద్, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

### 'కుడా' పై అవగాహన కల్పించాలి

**శాయంపేట** : మండలంలోని ఎనిమిది రెవెన్యూ గ్రామాలు కుడా పరిధిలోకి విలీనం కానున్న నేపథ్యంలో గ్రామ ప్రజలకు కుడాపై అవగాహన కల్పించాలని బీఎస్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మగ్గం సుమన్ కోరారు. ఈ మేరకు శుక్రవారం డీపీఓకు వినతిపత్రం అందించారు. కుడాలో విలీనం చేస్తే కలిగే లాభనష్టాల గురించి ప్రజలకు స్థానిక అధికారులు అవగాహన కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. గ్రామసభల్లో ప్రజల అభిప్రాయలకంటే ముందే రాజకీయ నాయకులు కలవి చేసుకుని గ్రామసభల్లో గందరగోళం సృష్టించారని ఆయన ఆరోపించారు.

### బీజేపీ నాయకుల స్వాగతం



**ఆత్మకూరు** : భారీ వర్షాల కారణంగా ములుగు జిల్లాలో ముంపునకు గురైన బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు మండల కేంద్రంలో స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మండల అధ్యక్షుడు రాజు, ప్రధానకార్యదర్శి పైడి, కిసాన్‌సెల్ కోఆర్డినేటర్ వంగాల బుచ్చిరెడ్డి తదితరులు ఉన్నారు.

### ఆకాశంలో హరివిల్లు



**శాయంపేట:** శాయంపేట మండల కేంద్రంలో శుక్రవారం ఆకాశంలో హరివిల్లు అలరించింది. మండల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. ఈ హరివిల్లును 'సాక్షి' క్లిక్ మనిపించింది.

### బాధ్యతలు స్వీకరించిన ఎస్సై

**చెన్నారావుపేట:** నూతన ఎస్సైగా రాజేష్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కాగా ఇదివరకు ఇక్కడ పనిచేసిన గూడ అరుణ్ నర్సంపేటకు బదిలీపై వెళ్లారు.

# పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

**నర్సంపేట:** భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి చిర్ర సూరి డిమాండ్ చేశారు. పట్టణంలో శుక్రవారం డివిజన్ కమిటీ సమావేశం డివిజన్ కార్యదర్శి అడ్డూరి రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో వివిధ రకాల పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భారీ వర్షాలకు పంట నష్టపోయి మృతి చెందిన రైతు కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఇళ్లు కోల్పోయిన రైతులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించివ్వాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిర్ర సూరి

# మండల పరిషత్ కార్యాలయానికి ముప్పు

- పెచ్చులూడుతున్న భవనం
- భయాందోళనలో అధికారులు, కార్యాలయ సిబ్బంది

**ఆత్మకూరు** : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయానికి ముప్పు పొంచి ఉంది. భవనం పెచ్చులూడిపోయి శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనం 2006 సంవత్సరంలో ప్రారంభించారు. భవనం పైకప్పు పెచ్చులూడడంతో సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. మీటింగ్ హాల్ మొత్తం పెచ్చులూడడంతో దానికి తాళం వేశారు. అలాగే ఎంపీపీ చాంబర్‌లో వాష్‌రూమ్ గోడలకు పగుళ్లు ఏర్పడగా, పక్కన ఉన్న మరో శిథిలావస్థలోని హాల్‌లోనే సమావేశాలు నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిత్యం పంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందికి ,ఈజీఎస్ సిబ్బందికి సమావేశాలు నిర్వహించి పలు సూచనలు, గ్రామస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలను దిశానిర్దేశం చేస్తుంటారు. అలాగే సర్వసభ్య సమావేశం నిర్వహిస్తుంటారు. దీంతో కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడం, వర్షాకాలం కావడంతో కార్యాల భవనం ఎప్పుడు కూలుతుందోనని అధికారుల, సిబ్బంది భయాందోళన చెందుతున్నారు.

**అడుగుపెడితే జారుడే..**

**నడికూడ** : మండలంలోని ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణం బురదమయంగా మారింది. మండల ప్రజలు వివిధ సమస్యల పరిష్కారానికి అధికారులకు దరఖాస్తులు, ఫిర్యాదు చేసేందుకు వస్తుంటారు. ఈక్రమంలో ప్రజాపరిషత్ ఆవరణం జారుడుబండలా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడకపోయిన బురదగా ఉండడంతో దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు తెలిపారు. గ్రామాల్లోని మట్టిరోడ్లను తలపిస్తుందని, అధికారులు నిత్యం చూస్తూ వెళ్తున్నారనే తప్పా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు తిప్పల తప్పడం లేదని స్థానికులు వాపోతున్నారు. గడ్డి, పిచ్చి మొక్కలు, ఉండటంతో అంగన్‌వాడీ పిల్లల తల్లిదండ్రులు పిల్లను పంపించేందుకు వెనుకడుగు వేస్తున్నట్లుతెలిసింది. మండల అభివృద్ధి అధికారి విధులు నిర్వర్తించే ఈ కార్యాలయంలోనే ఇలాంటి సమస్యలు పేరుకుపోవడంతో పలు విమర్శలకు దారితీస్తోంది. జిల్లాస్థాయి అధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బురద కాకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ఆత్మకూరు : మండల పరిషత్ కార్యాలయం



ఆత్మకూరు : పెచ్చులూడిన భవనం



ఆత్మకూరు : శిథిలావస్థకు చేరుకున్న భవనం



నడికూడ : కార్యాలయ ఆవరణంలో బురద

### ప్రతిపాదనలు పంపిస్తాం

మండల పరిషత్ కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న విషయం వాస్తవమే. నూతన భవన నిర్మాణం గురించి ప్రతిపాదనలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ, ఆత్మకూరు

# యూత్ సభ్యులను అధిక మెజార్టీతో గెలిపించాలి

**చెన్నారావుపేట** : యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఎమ్మెల్యే మాధవరెడ్డి బలపరిచిన అభ్యర్థులను అధిక మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని లింగాపురంలో విత్ ఐవైసీ ద్వారా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువజన కాంగ్రెస్ అభ్యర్థిగా జక్కిడి శివచరణ్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభ్యర్థిగా ఓరుగంటి మైపాల్, జిల్లా యువజన కాంగ్రెస్ అభ్యర్థిగా కురవి పరమేశ్, నర్సంపేట నియోజకవర్గ అభ్యర్థిగా తుమ్మలపల్లి సందీప్, చెన్నారావుపేట మండల అధ్యక్ష అభ్యర్థిగా బండి హరీష్‌లను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, ఎన్నికల ఇన్‌చార్జ్ పబ్బతి సతీష్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముల ఇంద్రదేవ్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, తదితరులు ఉన్నారు.



యూత్ సభ్యులకు అవగాహన కల్పిస్తున్న యువజన కాంగ్రెస్ అభ్యర్థులు

# కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



**నడికూడ** : మండలంలోని కంఠాత్మకూరు వాగు వద్ద రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు ఇటీవల కురుస్తున్న వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో పరకాల–అంబాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.